ప్రజాశక్తి

సోమవారం 26 డిసెంబర్ 2022 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



దుండగులు మధ్యలోనే వదిలేసిన కారు

'నల్లమల'లో దిగువమెట్ల వద్ద

దారిదోపిడీ

- బంగారు వ్యాపారస్తుల నుంచి రూ.21 లక్షల నగదు, 1.7 కిలోల బంగారం అపహరణ
- అటవీ ప్రాంతంలో కారు వదిలి పరారైన దుండగులు
- అందులో రూ.14 లక్షలు.. కిలో బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-గిద్దలూరు, గిద్దలూరు రూరల్

నల్లమల అటవీ ప్రాంతంలో దుండగులు కారును అటకాయించి.. వ్యాపారులను కొట్టి.. రూ.21 లక్షల నగదు, కిలో 700 గ్రాముల బంగారం అపహరించారు. వారి కారులోనే పరారయ్యారు. ఈ ఘటన గిద్దలూరు మండలం, దిగువమెట్ట గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు వెంటనే రంగంలోకి దిగటంతో కారును దొంగలు వదిలేసి..రూ.7 లక్షల నగదు, 700 గ్రాముల బంగారాన్ని తీసుకొని ఉడాయించారు. కారులోని మిగిలిన నగదు, బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ▶ 2లో

300 యూనిట్ల గండం

- సంక్షేమ పథకాల కత్తెరకు ఎంచుకున్న ప్రధాన మార్గం
- ఐటి కడుతున్నా ఇక అంతే..
- బ్యాంకు రుణాల కోసం ఐటి తప్పనిసరి
- గడపగడపకూ.. కార్యక్రమంలోనూ ఇదే తరహా ఫిర్యాదుల వెల్లువ



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

- 'మా బంధువుల అబ్బాయి కారు కొన్నాడు. అతని పేరు మా రేషన్ కార్డులో ఉంది. దీంతో నాకు పింఛను ఆపేశారయ్యా..' అంటూ 28వ వార్డులో ఓ వృద్ధురాలు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి వివరించారు. కారు ఉన్న వ్యక్తిని కార్డు నుంచి తీసేసినా పింఛను రాలేదని వాపోయారు.

- రామ్‌నగర్ 7వ లైనులో ఓ వృద్ధురాలు తమ కుమారుడితో కలిసి ఉంటోంది. కుమారుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రెండు పోర్షన్ల ఇల్లు ఒకే మీటరుపై ఉండటంతో కరెంటు బిల్లు పెరిగింది. దీంతో ఆమె పింఛను పోయింది. ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదని ఆమె వాపోతున్నారు.

ఇలా పట్టణాలు.. పల్లెలు.. అనే తేడా లేకుండా ఏదో ఒక సాకుతో ఉన్న పథకాలు పోతున్నాయి. అందే లబ్ధి చేజారుతోంది. కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం విధిగా పెట్టిన ఈ షరతుల వల్ల భవిష్యత్‌లో సంక్షేమ పథకాలకు మరింత కత్తెర పడేలా కనిపిస్తోంది. ఒకసారి ఇచ్చిన వాటిని ఊడగొట్టడం ఏమిటనే చర్చ కూడా సాగుతోంది. ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. గడపగడపకూ వెళ్లిన చోట్ల ఎక్కువ సమస్యలు ఇవే వస్తున్నాయి. పింఛను పోయిందంటూ వృద్ధులు ఏడుస్తున్నారు. ఇలాంటి సమస్యలకు ఎలా పరిష్కారం చూపాలో కూడా నేతలకు అంతుచిక్కడం లేదు. కొందరు వ్యక్తిగతంగా ఏదో రూపంలో సాయం చేస్తున్నారు. కొందరు ఏదో ఒకటి చెప్పి తప్పుకుంటున్నారు. రానున్న కాలంలో తాజా షరతులు అమలు చేస్తే ఎంతమందికి ఉన్నవి ఊడతాయో తేలాల్సి ఉంది.

ఇటీవల కొత్త పింఛన్లు మంజూరు చేశారు. అందిన ధరఖాస్తులను వడపోసి సుమారు 8 వేల మందిని అర్హులుగా గుర్తించారు. 16 వేల దరఖాస్తులు సచివాలయాల నుంచి అందాయి. కరెంటు యూనిట్లు, ఐటీ వంటివి పరిగణలోకి తీసుకుని ఎంపిక చేశారు. ఇక పాతవాటిని తొలగించేందుకు కొన్ని మార్గదర్శకాలను ఎంచుకున్నారు. కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటినా, కారు ఉన్నా.. ఐటీ రిటర్న్లు ఉన్నా వెంటనే తొలగిస్తున్నారు. లబ్ధిదారులను వీటితో మ్యాపింగు చేయగానే అన్నీ పోతున్నాయి. బియ్యంకార్డు, పింఛను, సంక్షేమ పథకాలన్నీ చేజారుతున్నాయి. ప్రస్తుతం ఈ కారణాలతో పింఛన్లు ఆగినవే సుమారు 7 వేల వరకూ ఉన్నట్లు సమాచారం. నోటీసులు ఇచ్చారు. వెంటనే లబ్ధిదారులు సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. కరెంటు బిల్లులు పెరిగినందున కరెంటు శాఖ అధికారులతో కాగితాలు రాయించుకుని తెచ్చి ఇస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల ▶ 2లో

సునామీకి 18 ఏళ్లు

- ఆ మాట వింటేనే మత్స్యకారుల గుండెల్లో హడల్
- డిసెంబర్‌లో అన్నీ కష్టాలే అంటున్న కడలి పుత్రులు



సునామీ కాలనీ ఇదే..

ప్రజాశక్తి-శింగరాయకొండ

అది డిసెంబర్ 26.. ఆదివారం.. 2004 సంవత్సరం.. ఉదయం సమయంలో సముద్రంలో అలలు ఒక్కసారిగా పైకి లేచి ఊరి మీద పడ్డాయి. ఈ రాకాసి అలల కారణంగా శింగరాయకొండ మండలం, పాకల, ఊళ్లపాలెం మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులు, పర్యాటకులు మొత్తం 12 మంది మతిచెందారు. వీరిలో ఆరుగురు కందుకూరు నుంచి వచ్చిన పర్యాటకులు కాగా.. మరో ఆరుగురు ఊళ్లపాలెం గ్రామంలోని మత్స్యకారులు. ఉప్పుకొట్టారులో తండ్రికి భోజనం తీసుకెళ్లినవారు, ఉప్పుకొటారు పనులకి పోయిన వారు, సముద్రంలో వేటకి వెళ్లిన కొందరు మతిచెందిన వారిలో ఉన్నారు. మత్స్యకారులకీ బాగా నష్టం జరిగింది. దేశవ్యాప్తంగా వచ్చిన ఈ రాకాసి అలలకు 'సునామీ' అనీ పేరు పెట్టారు. ఆ సునామీ వచ్చి నేటితో 18 సంవత్సరాలైంది.

ఉదయం సమయంలో వచ్చిన రాకాసి అలల కారణంగా సముద్ర తీర ప్రాంతాలైన పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి గ్రామాల్లోని మత్స్యకారులు, ఉప్పుకొటారు రైతులు తీవ్రంగా నష్టపోయారు. సునామీ వచ్చిన కొద్ది గంటల్లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఊళ్లపాలెం గ్రామం వచ్చి.. మతిచెందిన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులను ఇతరులను స్వచ్ఛంద సంస్థలతో కలిసి బాగా ఆదుకుంది. బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి మత్స్యకారులను మళ్లీ వేటకు పోయే విధంగా చేశారు. అప్పుడు స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వం చేయూతనివ్వడంతో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందుల నుంచి కాస్త బయట పడ్డారు. అప్పటి జ్ఞాపకాలు మత్స్యకారులకు ఇంకా వెంటాడుతున్నాయి. డిసెంబర్ నెల వస్తేనే వారికి భయం వేస్తోంది. డిసెంబర్‌లో వరుస తుఫానుల దెబ్బకు ప్రతి సంవత్సరం మత్స్యకారులు ఇబ్బందులు ▶ 2లో



సునామీ వచ్చినప్పుడు కూలిపోయిన కట్టడం

'300 యూనిట్ల' గండం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి వేరు పడేందుకు నానా తంటాలు పడుతున్నారు. కొత్తగా ఒక వ్యక్తి ఉన్నవారికి రేషన్ కార్డు ఇవ్వడం లేదు. ఇతర పథకాలు కూడా ఒకరైతే ఇవ్వడం లేదు. ఇదొక సమస్యగా మారింది. వృద్ధులు దాదాపుగా అందరూ తమ పిల్లలు లేదా ఇతర కుటుంబసభ్యులతో కలిసి కార్డుల్లో ఉన్నారు. ఇది కూడా సమస్యగా మారింది. ఆదాయాలు లేకపోయినా అందరూ కలిసి ఉన్నందున కరెంటు బిల్లులు పెరుగుతాయి. ఎవరో ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వస్తే వాళ్ల కారు కొంటారు. అది కూడా ఈఎంఐలతోనే.. వీటిని పరిగణలోకి తీసుకొని ఉన్నత కుటుంబాలుగా భావించి వెంటనే సంక్షేమ పథకాలను తీసేస్తున్నారు.

సంక్షేమ పథకాలు పొందే వారికి మరొక పెద్ద చిక్కు ఏమిటంటే ఐటీ రిటర్నులు దాఖలు చేయడం. ఆదాయంతో సంబంధం లేకుండా ఐటీ రిటర్న్ ఉంటే వెంటనే పానుకార్డుకు లింకు చేసి సంక్షేమ పథకాలను తీసేస్తున్నారు. గతంలోనే 90 వేల మందికి పైగా ఈ సమస్యతో సంక్షేమ పథకాలను కోల్పోయారు. కొత్తగా ఈ జాబితా కూడా పెరుగుతోంది. ఎందుకంటే పిల్లలు ఇంజనీరింగ్ పూర్తిచేసి ఇతర దేశాలకు వెళ్లాలంటే బ్యాంకు రుణం తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంది. బ్యాంకు రుణం కావాలంటే మూడేళ్ల ఐటీ రిటర్నులు దాఖాలు చేయాల్సి ఉంది. దీంతో పేద కుటుంబాలు కూడా ఆడిటర్లను సంప్రదించి.. ఆదాయం ఉన్నా.. లేకున్నా బ్యాంకుల కోసం స్వల్పంగా ఐటీ కడుతున్నారు. ఏడాదికి రెండు, మూడు వేలు ఐటీ కడుతున్నా సరే సంక్షేమ పథకాలు పోతున్నాయి. వాస్తవానికి ఇలాంటి వారంతా ఆదాయం భారీగా ఉండి ఐటీ కట్టడం లేదు. కేవలం పిల్లల కోసం బ్యాంకు రుణం తీసుకునేందుకు పెట్టిన షరతుల వల్లనే. దీని వల్ల కేంద్రానికి ఆదాయం వస్తోంది. ఇటు సంక్షేమ పథకాలు పోతున్నాయి. వీటిని పరిశీలించాలని ఎన్నో విజ్ఞప్తులు వచ్చినా పట్టించుకోవడంలేదు. ఐటీ అనగానే అన్నీ తీసేస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి షరతులను ఎత్తేయాలి. కుటుంబ ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకునే సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉంది. అలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చిక్కుల్లో ఉన్నందున ఏదో రకంగా కోతలు పెట్టేందుకు ఇలాంటి మార్గాలు ఎంచుకుంటే అర్హులకు అన్యాయం జరుగుతుంది. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

దారిదోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

నరసరావుపేటకు చెందిన బంగారు వ్యాపారులు ముడిసరుకు తెచ్చి.. నంద్యాలలో బంగారం వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో నలుగురు వ్యాపారులు శనివారం నంద్యాల వచ్చారు. వ్యాపారం ముగించుకొని బంగారం, నగదుతో నరసరావుపేటకు ప్రయాణమయ్యారు. గిద్దలూరు మండలం, దిగువమెట్ట వద్ద ఆరుగురు దుండగులు కారును ఆపారు. వ్యాపారులను కొట్టారు. వారి వద్ద ఉన్న రూ.21 లక్షల నగదు, 1.700 కిలోల బంగారం తీసుకెళ్లారు. వ్యాపారుల కారు తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న గిద్దలూరు సిఐ ఫిరోజ్ తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకొని.. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వెంబడిస్తున్నారని తెలుసుకున్న దొంగలు నల్లమల అటవీ ప్రాంతంలో కారును వదిలి పరారయ్యారు. కారులో రూ.14 లక్షలను, కిలో బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా 7 లక్షల నగదు, 700 గ్రాములు బంగారంతో దొంగలు పరారైనట్లు పోలీసులు తెలిపారు. దొంగలను కోసం గాలిస్తున్నామన్నారు.

పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

తుఫాన్ ప్రభావం, వాతావరణంలో వచ్చిన మార్పులు కారనంగా ఆదివారం నుంచి చలి తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. చలికారణంగా రాత్రి 10 గంటల తర్వాత ప్రజలు బయటకు రాలేక పోతున్నారు. అదే విధంగా ఉదయం 10 గంటల వరకూ చలి తీవ్రత కారణంగా ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి ఉండటం లేదు. వాతారణంలో మార్పుల కారణంగా పంటకు పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



సచివాయంలో వినతి పత్రం అందేస్తున్న గొర్రెలు,మేకల పెంపకం దార్లు

గొర్రెలు, మేకల పెంపకందారుల

సమస్యలు పరిష్కరిచాలని వినతి

ప్రజాశక్తి- ముండ్లమూరు

గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని పూరిమెట్ల గ్రామ సచివాయలంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొర్రెల కాపరుల సంఘం నాయకులు మాట్లాడుతూ గొర్రెలకు నాచురోగం కాకుండా టీకాలు వేయాలని కోరారు. వైఎస్ఆర్ పశు నష్టపరిహారం పెండింగ్ నిధులు బాధిత పశు కాపరుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాని కోరారు. ఈదర పశు వైద్యశాలకు పర్మినెంట వైద్యుడిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, స్థానిక నాయకులు ఒట్టిగుర్ల పాములయ్య, సమ్మని శ్రీను, కుప్పా స్వామి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలే కోన చారిటబుల్ ట్రస్టు ధ్యేయం

ఎమ్మెల్యే కోన రఘుపతి



ప్రజాశక్తి - బాపట్ల రూరల్

పది మందికి మంచి చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కోన చారిటబుల్ ట్రస్టు ధ్యేయమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. తన తండ్రి దివంగత కోన ప్రభాకరరావు చెప్పిన ప్రతి మాటను తాను అనుసరిస్తున్నట్లు తెలిపారు. ఒకరిని మెప్పించడానికి చేసే ప్రయత్నాలు సఫలం కాకపోవచ్చునని, మనం స్ఫూర్తిగా చేసే ప్రతి పని తప్పక విజయవంతం అవుతుందన్నారు. కోన చారిటబుల్ ట్రస్టు ద్వారా రెండు దశాబ్దాలకు పైగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

వృద్ధాశ్రమంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -దర్శి

క్రిస్మస్ సందర్భంగా కురిచేడు రోడ్‌లోని షిర్డిసాయిబాబా వృద్ధాశ్రయంలో మద్దిశెట్టి యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు కేక్‌లు, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రాజేష్ 50 కేజీలు బియ్యం, 5 కేజీలు కందిపప్పు, మూడు నూనెప్యాకెట్లు వృద్ధాశ్రమ నిర్వాహకులు మస్తాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెంజిమన్, జాన్‌పాల్, సంతోష్, బెర్లీ, బబ్లు, ఆమోస్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వృద్ధురాలు

ట్యాంక్‌బండ్ నిర్మాణం లేనట్లే..

- డబుల్ రోడ్డుకే పరిమితం
- నిధుల కొరతే కారణం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్ మార్గంలోని చెరువు కట్ట రహదారిని ట్యాంక్‌బండ్‌గా నిర్మించాలనే కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. ప్రస్తుతం ఉన్న డబుల్ రోడ్డుపై కొత్తగా రోడ్డు నిర్మాణంతో సరిపెట్టుకోవాల్సిందే. ట్యాంక్ బండ్ నిర్మాణానికి నిధుల కొరతే కారణమని తెలిసింది.

మార్కాపురం పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు చెరువు కట్ట రోడ్డుపై వెళ్లాల్సి ఉంది. ఇదే మార్గంలో పొదిలి-ఒంగోలు కూడా ప్రయాణాలు సాగించాలి. నిత్యం ఆ రహదారి రాకపోకలతో రద్దీగా ఉంటోంది. చెరువు కట్ట రహదారి వెడల్పు చేయాలనే ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రమాదాలు కూడా అధికంగా జరుగుతున్నాయి. ట్యాంక్‌బండ్ నిర్మాణంతో పాటు నాలుగు లైన్‌ల రోడ్లతో అందంగా తీర్చిదిద్దేందుకు రూ. 22 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నిధుల కొరత కారణంగా ప్రస్తుతం ఉన్న రోడ్డుతో సరిపెట్టుకోవాలని, పాత రోడ్డుపై కొత్తగా రోడ్డు నిర్మాణం కోసం రూ. 12.12 కోట్లు మంజూరు చేశారు. దీంతో ట్యాంక్ బండ్ నిర్మాణం వెనక్కిపోయింది. కేవలం డబుల్ రోడ్డుకే పరిమితమైంది.



మార్కాపురం రైల్వే స్టేషన్ రోడ్డు

ఎన్‌డిబి నిధులతో రహదారుల అభివృద్ధి

ఆర్‌అండ్‌బి ఇఇ రామాంజనేయులు

మార్కాపురం డివిజన్‌లో పలు రహదారుల అభివృద్ధి కోసం ఎన్‌డిబి నిధులు ఖర్చు చేస్తున్నట్లు మార్కాపురం ఆర్‌అండ్‌బి ఇఇ ఎం.రామాంజనేయులు తెలిపారు. మార్కాపురం చెరువు కట్ట రోడ్డు మార్గం రూ. 12.12 కోట్లతో అభివృద్ధి జరుగుతుందన్నారు. యర్రగొండపాలెం నుంచి త్రిపురాకంతకం రహదారి 15.50 కిలో మీటర్ల దూరంలో డబుల్ రోడ్డు కోసం రూ. 34.26 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. పెద్దదోర్నాల రహదారిలో దేవరాజుగట్టు నుంచి పెద్దారవీడు వరకు 4.71 కిలో మీటర్ల దూరంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు 9.4 కోట్ల వ్యయంతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్‌డిబి నిధులు ఫేజ్-2లో మార్కాపురం నుంచి తర్లుపాడు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం రూ. 15 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

సునామీకి 18 ఏళ్లు

(మొదటిపేజీ తరువాయి)

పడుతూనే ఉన్నారు. సునామీ వచ్చినప్పుడు పడిన ఇబ్బందుల కంటే ఇప్పుడు పడుతున్న ఇబ్బందులు లెక్కేం కాదని మత్స్యకారులు చెప్తున్నారు. ఊళ్లపాలెం సముద్ర తీరం వద్ద అప్పుడు మత్స్యకారులు వలలు, బోట్లు వేసుకునేందుకు ఏర్పాటు చేసిన రెండు భవనాలు నేటికీ అలాగే పడిపోయి సునామీ గుర్తులుగా ఉన్నాయి.

బింగినపల్లిలో సునామీ కాలనీ

శింగరాయకొండ మండలం, బింగినపల్లి గ్రామంలో సునామీ సమయంలో ఆ కాలనీ వాసులు నష్టపోయారని అప్పటి పాలకులు గుర్తించారు. ఆ కాలనీ మొత్తం అప్పుడు గిరిజనులు గుడిసెలు వేసుకుని జీవనం సాగించేవారు. వాళ్లందరికీ సునామీ తర్వాత 'సునామీ కాలనీ' పేరుతో పక్కా గహాలు నిర్మించారు. అప్రేడా సునామీ కాలనీ పేరుతో 50 గహాలకు ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. అప్పటి ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కొణిజేటి రోశయ్య ఆ సునామీ కాలనీని ప్రారంభించారు.

రైతుల్లో మళ్లీ ఆందోళన...

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్ట పోయారు. ఇంతవరకూ ఎన్యుమరేషన్‌లో శనగ, పొగాకు, మిర్చి పంటల నష్టాన్ని నమోదు చేయలేదు. రైతులకు నష్టపరిహారమూ అందలేదు. వర్షాలకు దెబ్బతిన్నగా మిగిలిన పంటలను కాపాడుకొనేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో ఈ తరుణంలో మళ్లీ తుఫాన్ అని ప్రకటించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షం పడితే ఉన్న కొద్దిపాటి పంట కూడా చేతికందే అవకాశం ఉండదని రైతులు చెబుతున్నారు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షానికి మిర్చి, పొగాకు, శనగ తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొగాకు కొట్టుకు వచ్చిన సమయంలో వర్షం కారణంగా పూర్తిగా దెబ్బతింది. దీంతో పంటను పీకేశారు. అధిక ధరలకు నారు కొనుగోలు చేసి తిరిగి నాట్లు వేశారు. మళ్లీ తుఫాన్ అని ప్రకటించడంతో రెండుసారి వేసిన పంటలు ఎక్కడ దెబ్బతింటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నీటి మునిగిన పొగాకు (ఫైల్)

ప్రజాశక్తి
సోమవారం 26 డిసెంబర్ 2022

డాక్టర్ నరసింహారావు జయంతి

లయన్స్, గెలాక్సీ క్లబ్‌ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి కంటి ఆసుపత్రి వైద్యుడిగా ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ ఎంవిఎల్. నరసింహారావు చీమకుర్తికి వన్నె తెచ్చారని మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు తెలిపారు. డాక్టర్ ఎంవిఎల్. నరసింహారావు 102వ జయంతి సందర్భంగా లయన్స్‌క్లబ్,గెలాక్సీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్ నర్సింగ్ హోంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు చీమకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ నరసింహారావు తన వైద్యవృత్తి ద్వారా చీమకుర్తికి రాష్ట్రవ్యాప్తంగా పేరు తెచ్చారన్నారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జవహర్ మాట్లాడుతూ తమ మామగారైన డాక్టర్ నరసింహారావు పేరు మీదుగా గత 50 ఏళ్ళుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ



వంట సామగ్రి అందజేస్తున్న లయన్స్‌క్లబ్ నాయకులు

.కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్ విజయ కుమార్‌రెడ్డి, లయన్స్ జిల్లా నాయకులు లక్ష్మినారాయణ,గెలాక్సీ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ముత్యాలప్రసాదు, చీమకుర్తి లయన్స్‌క్లబ్ కార్యదర్శి చలువాది రమేష్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నూనెహేమసుందరరావు, లయన్స్ నాయకులు ఆలపాటి నరసింహారావు, మందపాటిశ్రీను, ఎం. రాజా,కె. ఏడుకొండలు, కె.వడ్డికాసులు, పేరం శ్రీను, ఎ. రామబ్రహ్మం, అంజిరెడ్డి,జె. యాకోబు, వీరారెడ్డి, కాశమ్మ, మద్దాళి మాధవరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు

డాక్టర్ ఎంవిఎల్. నరసింహారావు జయంతి సందర్భంగా లయన్స్‌క్లబ్,గెలాక్సీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహించారు. నలుగురు మహిళలకు కట్టుమిషన్లు, నలుగురు విద్యార్థులకు సైకిళ్ళు అందజేశారు. పేద మహిళకు గ్రైండర్,పేద ఇంజినీరింగ్ విద్యార్థికి ల్యాబ్‌ల్యాప్ అందజేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల,ఉన్నత పాఠశాలలకు వాచ్‌మెన్ ఏర్పాటుకు గ్రాంట్ అందజేశారు. గిరిజన గురుకుల పాఠశాలకు కుర్చీలు అందజేశారు. ఇద్దరు కేన్సర్ బాధితులకు ఆర్థిక సహాయం అందజేశారు. రంగస్థల కళాకారుడు చీమకుర్తి నాగేశ్వరరావు భార్యకు పెన్షను అందజేశారు. బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వంటసామగ్రి,పల్లామల్లి జివిఎస్ఆర్ పాఠశాలకు స్పెషల్ గ్రాంట్,జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల స్పెషల్ టీచర్ ఏర్పాటుకు గ్రాంట్ అందజేశారు. 250 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. పాదరక్షల పనివార్లకు లయన్స్ గొడుగులు అందజేశారు.ఓ వ్యక్తికి సైకిల్, అందజేశారు.

ముస్లిం సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పామూరు

పామూరు పట్టణంలోని కందుకూరు రోడ్ నూతనంగా ఏర్పాటు చేసిన ముస్లిం సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్ బాషా, జిల్లా అధ్యక్షుడు షేక్ అహ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడు పటాన్ సర్దార్ ఖాన్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా, సంతనూతలపాడు ఎంప్లాయిస్ అధ్యక్షులు ఎస్ఎ. రహీం, ఒంగోలు పట్టణ ఎంప్లాయిస్ ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్ జిలాని, చీమకుర్తి ఎంప్లాయిస్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా, జిల్లా యూత్ అధ్యక్షుడు రహిమాన్, షేక్ బాషా, కనిగిరి నియోజకవర్గ గౌరవాధ్యక్షులు షేక్ హాజీ గౌస్, నియోజకవర్గ అధ్యక్షులడుషేక్ హుస్సేన్, ఉపాధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

బైకులు ఢీకొన్న ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మేడపి గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు మృతుడు పుల్లలచెరువు మండలం రెంటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన వ్యక్తి

పంట దుబ్బులు తగలబెట్టవద్దు

రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల సూచన

ప్రజాశక్తి- బాపట్ల రూరల్

పంటలు కోశాక మిగిలిన దుబ్బులను తగలబెట్టరాదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మండల పరిధిలోని అప్పికట్ల ప్రాంతంలో రైతులు పంట కోశాక దుబ్బులను తగలబెట్టినట్లు తెలిపారు. ఈ చర్య మంచిది కాదని వారు పేర్కొన్నారు. అలా తగల పెట్టడం వల్ల పర్యావరణానికి వాయు కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. నేలలోని భూసారం తగ్గుతుందన్నారు. నేలలో భూసారాన్ని పెంచే మిత్ర కీటకాలు నశించిపోతాయన్నారు. అందువల్ల తర్వాత సేద్యానికి ఎక్కువ మోతాదులో ఎరువులను వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. పంట కోసిన తర్వాత రెండో పంట వేసే రైతులు పంట అవశేషాలను నీటిలో కుళ్ళబెట్టాలన్నారు. అందు వల్ల నేలలో భూసారం పెరిగి పంట అధిక దిగుబడి వస్తుందన్నారు.

టిడిపి నాయకుడు కనకం శ్రీను మృతి

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీ పరిది లోని చింతలపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కనకం శ్రీను (45) అనారోగ్యంతో శనివారం రాత్రి మతి చెందాడు. ఆయన మతదేహాన్ని నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, దర్శి పట్టణ టిడిపి అధ్యక్షుడు యాదగిరి వాసు, టిడిపి మండల అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. శ్రీను మృతి పార్టీకి తీరనిలోటని తెలిపారు. కనకం శ్రీను మృతికి 20వ వార్డు కౌన్సిలర్ కనకం శ్రీనివాసరావు, టిడిపి నాయకులు సంగా తిరుపతిరావు. సందు చంద్ర, చింతల అంజి, కనకం సైదా, ఉప్పు వెంకటేశ్వర్లు, అచ్చిరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తునన టిడిపి నాయకులు

కారు ఢీకొని వ్యక్తి మృతి

- జాతీయరహదారి
మృతుడి బంధువుల ఆందోళన
- భారీగా నిలిచి పోయిన ట్రాఫిక్

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మార్టూరు సమీపంలోని రాజుపాలెం కూడలి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు...రాజుపాలెం ప్రబోధనగర్ కాలానికి చెందిన తేళ్ల ఇజ్రాయిల్ ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. రోజులాగే విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు దేగరాముడి వైపు నుంచి రాజుపాలెం వెళ్ళడానికి రోడ్డు తున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్ళిపోయింది. ఇజ్రాయిల్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న మృతుడి బంధువులు పెద్దసంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకొని స్థలానికి జాతీయ రహదారిపై బైటాయించారు. దీంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. అయినప్పటికీ వారు శాంతించలేదు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదంటూ పట్టు పట్టారు. దీంతో జాతీయరహదారిపై 15 కిలోమీటర్ల పొడవున ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.సమాచారం అందుకున్న మార్టూరు సిఐ ఫిరోజ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి బంధువులతో మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా రాజుపాలెం స్టేజీ వద్ద ప్రమాదాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని ఆ ప్రాంతంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. అక్కడ బ్రిడ్జి నిర్మించేలా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని సిఐ హామీ ఇవ్వడంతో మృతుడు బంధువులు ఆందోళన విరమించారు.



రహదారిపై బైటాయించిన మృతుడి బంధువులు

బాలికపై బంధువు అత్యాచారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మతిస్థిమితం లేని ఓ బాలికపై ఆమె బంధువు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పుల్లల చెరువు గిరిజన తాండలో ఆదివారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. మతి స్థిమితం లేని 15 సంవత్సరాల బాలిపై ఆమె బంధువు శనివారం రాత్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక వైద్య పరీక్షలు నిమిత్తం మార్కాపురం తరలించినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొమ్మినేని లక్ష్మీ సుధాకర్ మృతి

ప్రజాశక్తి - పంగులూరు

విశ్రాంత ప్రధానో పాధ్యాయుడు,నాటక రంగ కళాకారుడు కొమ్మినేని లక్ష్మీ సుధాకర్ (72) ఆదివారం మధ్యాహ్నం పంగులూరు లోని తన స్వగహంలో మృతిచెందాడు. సుధాకర్ ఉపాధ్యాయుడిగా పనిచేయక ముందు నుంచే స్టేజీ నాటికల్లో నటించేవారు. నాటక, సినీ రచయిత, వసంతాచార్య మరి కొంతమందితో కలిసి పంగులూరు గ్రామంలో కళా స్రవంతి అనే సాంస్కృతిక సంస్థను స్థాపించారు. గ్రామంలో అనేక అభ్యుదయ నాటకాలు ప్రదర్శించారు. అనేక పరిషత్ నాటికలు కూడా ప్రదర్శించాడు. గ్రామంలో అనేకమంది కళాకారులను తయారు చేశాడు. ఉపాధ్యాయుడిగా అనేక పాఠశాలలో పనిచేసి అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దాడు.మండల పరిధిలోని చందలూరు, పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడుగా పనిచేశారు. ఆ సమయంలో విద్యార్థులలో మంచి అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఇటీవల అమెరికాలో ఉంటున్న కుమారులు వద్దకు వెళ్లి కొంతకాలం అక్కడే ఉన్నాడు. అక్కడ ఆరోగ్యం క్షీణించటంతో స్వగ్రామానికి తీసుకొచ్చారు. రెండు, మూడు నెలల నుంచి అనారోగ్య కారణమై బాధపడుతున్న సుధాకర్ ఆదివారం మృతిచెందాడు. ఆయనకు భార్య పార్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పిల్లలు ముగ్గురు అమెరికాలో ఉద్యోగాల రీత్యా స్థిరపడ్డారు. సుధాకర్ భౌతికకాయాన్ని విశ్రాంతి ఉపాధ్యాయుడు తాతయ్య మాస్టారు, చందలూరు పాఠశాల ఉపాధ్యాయులు, సిపిఎం జిల్లా నాయకులు తలపనేని రామారావు, రాయిని వినోద్ బాబు, తలపనేని సుబ్బారావు , మండల అభివద్ధి కమిటీ అధ్యక్షుడు రాయని వెంకట సుబ్బారావు, పంగులూరు ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



లక్ష్మీసుధాకర్ (మృతి)

ఆవు అడ్డురావడంతో బైకు అదుపుతప్పి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆవు అడ్డురావడంతో బైకు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గిరిజన స్టోర్ సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన జడ్డా కిరణ్ కుమార్ (27) మృతి చెందాడు. మృతుడు రోజులాగే టైలరింగ్ పని ముగించుకొని బైకు శనివారం రాత్రి ఇంటికి వస్తున్నాడు. ఘటన స్థలం వద్దకు వచ్చేసరికి బైకుకు ఆవు అడ్డంగా వచ్చింది. ఆవును తప్పింబోయి బైకు అదుపు తప్పి బోల్తా కొట్టింది. రోడ్డు డివైడర్‌కు తగలడంతో కిరణ్‌కుమార్ తల, ఛాతిపై బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు సంఘమిత్రకు తరలించారు. పరిస్థితి విషమించడం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



కిరణ్ కుమార్ (ఫైల్)



చీరలు అందజేస్తున్న బాచిన కృష్ణ చైతన్య

చీరలు పంపిణీ

ప్రజాశక్తి- సంతమాగులూరు

క్రిస్మస్ పండుగ సందర్భంగా మండల పరిధిలోని ఏల్చూరు గ్రామంలోనున్న తెలుగు బాప్టిస్ట్ చర్చిలో 100 మంది క్రైస్తవ మహిళలకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్ మరియు వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య చైతన్య చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మందా సూరిబాబు, నాయకులు విప్పల ముసలారెడ్డి, దుద్దేల గాలెయ్య, చింతా రామారావు, బొల్లినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **పిసిపల్లి :** క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని మురుగమ్మి గ్రామంలో వితంతువులకు చీరలు పంపిణీ చేసినట్లు పాస్టర్ జి.పురుషోత్తం తెలిపారు. **చీమకుర్తి:** క్రిస్మస్ సందర్భంగా స్థానిక సెవెన్త్ డే అడ్వెంటిస్ట్ చర్చిలో 5వ వార్డు కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య,శారద దంపతుల ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ యూత్ అధ్యక్షుడు మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు,పి. రాజసులోచన, కొత్తప్రసాద్,పి.సురేష్ పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు

మంగినపాడులో అంధకారం

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు మండలం చెన్నుపాడు పంచాయతీలోని మంగినపాడు గ్రామంలో గత 10 రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలిపోతున్నారు. విషసర్పాల భయంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించి వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

27న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభా వంతులు మరియు వయో వద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో మూడు చక్రాల మోటారు వాహనాలు మంజూరు చేసేందుకు లబ్దిదారుల ఎంపిక కోసం ఈనెల 27న కలెక్టరేట్ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా మేనేజర్ జి.అర్చన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలకు అద్దంకి, పర్చూరు, వేమూరు,రేపల్లె నియోకవర్గాలకు సంబంధించి ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ ధవ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.27న ఉదయం అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల అభ్యర్థులకు, మధ్యాహ్నం నుంచి వేమూరు,రేపల్లె నియోజకవర్గం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా మేనేజర్ అర్చన తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్‌ను చీరాల ఐటిసి అతిథిగృహంలో జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి : సిఐటియు

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈనెల 27,28 తేదీల్లో చీమకుర్తిలో నిర్వహిస్తున్న సిఐటియు 12వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక దాచూరిరామిరెడ్డి భవనంలో కరపత్రాలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు మాట్లాడుతూ 27న సాయంత్రం 3గంటలకు స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్ నుంచి బూచేపల్లి కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బూచేపల్లి కల్యాణమండపం ప్రక్కన వేదికపై భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు,ఏపి అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ పాల్గొంటారన్నారు. అధిక సంఖ్యలో కార్మికులు,ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రమేష్, చీకటిశ్రీనివాసరావు, సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఎస్‌డి.హనీఫ్, పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు పాల్గొంటారని తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణలో చీమకుర్తి ఏరియా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బి.వీరాంజనేయులు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, జిల్లా నాయకులు పూసపాటి వెంకటరావు, సిఐటియు నాయకులు ఇ. నాగయ్య, బి. ఓబులేషు, వివిధ సంఘాల నాయకులు టి.రామారావు, కంకణాల వెంకటేశ్వర్లు, పాండు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పీడీ రాజ్యలక్ష్మి బంగారు పతకాలు

ప్రజాశక్తి-మద్దిపాడు



ఆటలతో వయసుతో పనిచేదని లేదని పెదకొత్త పల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల పీడీ భైరవునేని రాజ్యలక్ష్మి నిరూపించారు. 45ఏళ్ల వయసులో భర్త ప్రోత్సాహంతో అంతర్జాతీయ జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు.. నెల్లూరులోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన 2022 మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 45ఏళ్ళపై బడిన వయస్సు కేటగిరిలో 200 మీటర్లు, 400మీటర్లు, 5కె ఎం వాకింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. గతంలో గుంటూరు, కర్నూల్, వైజాగ్ నిర్వహించిన పోటీల్లో రాజ్యలక్ష్మి పాల్గొని పతకాలు సాధించారు. 2019లో మలేషియాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని రాజ్యలక్ష్మి తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మికి రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాం ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

బాపట్ల ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కోడి పందాలు, పేకాట, మట్కా లాంటి జూదాలు జీవితాలను నాశనం చేస్తాయని, సంఘ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మేరకు పోలీసు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా కోడి పందాలు, పేకాట, మట్కా, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే స్థావరాలపై ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. ఆసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారు, కార్యకలాపాలలో పాల్గొనే వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. కోడి పందాల జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడిపుంజులు, కోడి పందాలలో ఉపయోగించే కత్తులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలైన కోడిపందాలు, జూదం, మట్కా వంటి వాటిని నిర్వహించే వారిని ఉపేక్షించ బోమన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలైన జరుగుతున్నట్లు ప్రజల దష్టికి వస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లేదా డయల్ 100 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

తీరంలో ఎగసిపడుతున్న అలలు

ప్రజాశక్తి- కొత్తపట్నం

తుఫాన్ ప్రభావంతో కొత్తపట్నం తీరం వద్ద సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు తమ వలలు, బోట్లను ఒడ్డుకు చేర్చు కున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. తుఫాను కారణంగా సముద్రంలో అలల తీవ్రత పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు మెరైన్ పోలీసులు తీరంలో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో చలి తీవ్రత కూడా పెరిగింది. రాత్రి సమయంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేక పోతున్నారు. చలి కారణంగా వృద్ధులు , మహిళలు, చిన్న పిల్లలు అవస్థలు పడుతున్నారు.



ఒడ్డుకు చేర్చిన బోట్లు, వలలు

శిథిలావస్థలో రెవెన్యూ కార్యాలయం

- వర్షానికి ఉరుస్తున్న వైనం
- పెచ్చులూడి పడుతున్న శ్లాబ్
- భయాందోళనలో ఉద్యోగులు

ప్రజాశక్తి-పిసిపల్లి

తహశీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. రెవెన్యూ భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయానికి కిటికీలు లేవు. ముఖద్వారం తలుపులు కూడా నాసిరకంగా ఉండడంతో ఇనుప గేటును ఏర్పాటు చేసుకున్నారు. వర్షా కాలం వస్తే కార్యాలయంలో కూర్చునేందుకు కూడా తావు లేని పరిస్థితి. వర్షాలకు గోడలకు చెమ్మదిగి విద్యుత్ సరఫరా అవుతోంది. 1990లో తహశీల్దారు కార్యాలయ భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం అది పూర్తి స్థాయిలో శిథిలమైంది. అధికారులతోపాటు సమస్యలపై వచ్చే ప్రజలు కూడా ప్రాణభయంతోనే కార్యాలయంలోనికి వెళ్తున్నారు. కార్యాలయంలో ఫ్యాన్లు తిరిగే సమయంలో స్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో సిబ్బంది భయంతో ఫ్యాన్లు వేసుకోవడం లేదు. మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి తహశీల్దారు గది, సిబ్బంది గది, సమావేశం హాలులో కూర్చునేందుకు బయపడ్డారు. వర్షానికి స్లాబ్ మొత్తం ఉరవడంతోపాటు నేలంతా తడిసి ముద్ద అయ్యింది. టేబుల్‌పై ఉన్న ఫైల్స్ తడిసిపోతాయేమోనని సిబ్బంది బీరువాలో భద్రపరిచారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏలాంటి ప్రమాదం జరగక ముందే శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు, రెవెన్యూ సిబ్బంది కోరుతున్నారు.



స్లాబ్ పెచ్చులూడిన రెవెన్యూ కార్యాలయ భవనం

ప్రజాశక్తి 5
సోమవారం 26 డిసెంబర్ 2022



సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకాయమ్మ

సిఎంను కలిసిన 'బూచేపల్లి'

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రకాశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదివారం పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల అయ్యప్పస్వామి మాల దీక్ష ముగించి.. వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రసాదం, డైరీ అందించారు. అనంతరం ఇడుపుల పాయ వెళ్లి కీర్తిశేషులు ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌లో రాజశేఖరరెడ్డికి నివాళులర్పించారు.



నియామక పత్రం అందుకుంటున్న జివి రెడ్డి

వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్‌గా జివిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం


జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నూతన నియామకాలు జరిగాయి. మార్కాపురం ప్రాంతానికి చెందిన జివి రెడ్డి ప్రకాశం జిల్లా వినియోగదారుల హక్కుల చైర్మన్‌గా నియమితులయ్యారు. జాతీయ చైర్మన్ డాక్టర్ ఎంవిఎల్ నాగేశ్వరావు చేతుల మీదుగా జివి రెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర జడ్జి సూర్య భాస్కరం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జివి రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులుపై పోరాడుతానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన నాగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పోతుల కుటుంబ సేవలు ఆదర్శనీయం

ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-టంగుటూరు

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, కీర్తిశేషులు పోతుల చెంచయ్య దగ్గర నుండి ఆయన వారసులు పోతుల రామారావు నిరంతరం ప్రజా సేవలో ఉండటం ఎంతో ఆదర్శనీయమని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. కొండపి, కందుకూరు మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు నివాసం వద్ద జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతుల చెంచయ్య 26వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ నిస్వార్థ రాజకీయాలకు పోతుల కుటుంబం పెట్టింది పేరని అన్నారు. కొండపి నియోజకవర్గంతో పోతుల కుటుంబానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. కొన్ని దశాబ్దాల పాటు రాజకీయంగా ఈ ప్రాంత ప్రజలతో మమేకమై ఉన్న పోతుల కుటుంబం ప్రస్తుత



చెంచయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

రాజకీయాలకు దూరంగా ఉండటం కొంత బాధాకరంగా ఉందన్నారు. అనంతరం స్థానిక పురం సెంటర్, బస్ స్టాప్ సెంటర్, వెస్ట్ కాలనీలలోని పోతుల చెంచయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, పోతుల చెంచయ్య కుమారులు పోతుల రామారావు, పోతుల కష్ణారావు, పోతుల నరసింహారావు, పోతుల రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, చిడిపోతు వెంకటేశ్వర్లు, కొమ్మినేని వెంకట్రావు, పోతుల కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

ఆహార సలహా సంఘాలు ఉన్నట్టా..లేనట్టా.!


నిత్యావసరాల సరుకుల పంపిణీపై పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రజలకు రేషన్ ద్వారా నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ జరుగుతోందీ, లేనిదీ పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆహార సలహా సంఘాలు క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించటం లేదు. అన్ని రాజకీయ పార్టీలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉండే ఈ కమిటీలు నిత్యావసర సరుకుల పంపిణీపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఏమైనా సమస్యలుంటే కమిటీల ద్వారా ప్రభుత్వానికి తెలియజేసేవి. కానీ కొన్నేళ్లుగా ఈ కమిటీలు పని చేస్తున్న దాఖలాలే లేవు. నిత్యావసర సరుకుల పంపిణీపై పర్యవేక్షణ లోపించిదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలకు చేరాల్సిన బియ్యం, పంచదార, ఇతర సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయనే విమర్శలున్నాయి. పంపిణీ పర్యవేక్షణకు ఆహార సలహా సంఘాల్లో గ్రామస్థాయిలో సర్పంచ్, మండల స్థాయిలో మండల పరిషత్



అధ్యక్షుడు, చైర్మన్ల సారథ్యంలో ఈ కమిటీలు పని పనిచేస్తాయి. ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు జరిపి సమస్యలపై చర్చించేవి. కానీ ప్రస్తుతం ఈ కమిటీలు అసలు ఉన్నాయో లేవో తెలియని పరిస్థితి నెలకొంది. ఆహార సలహా సంఘాలు లేకపోవటంతో రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకుల పంపిణీపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గతంలో కమిటీలు ఉన్నపుడు, రేషన్ షాపుల నుంచి ప్రజలకు సరుకులను సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకునేవారు. కమిటీలే లేకపోవడంతో రేషన్ షాపుల నుంచి సరుకుల పంపిణీని సరిగా పట్టించుకోవడంలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కమిటీలు లేకపోవటంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు నిత్యావసర సరుకుల పంపిణీలో జరుగుతున్న లోపాలను ఎత్తి చూపలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే అన్ని స్థాయిల్లో ఆహార సలహా సంఘాలను పునరుద్ధరించాలని పలు రాజకీయ పార్టీల నాయకులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న మలినేని లక్ష్మయ్య

'మానవతా'కు అండగా ఉంటా..

మలినేని విద్యాసంస్థల అధినేత డాక్టర్ లక్ష్మయ్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మానవతా స్వచ్ఛంద సంస్థకు అండగా ఉంటానని మలినేని విద్యాసంస్థల అధినేత డాక్టర్ మలినేని లక్ష్మయ్య అన్నారు. ఆదివారం రాత్రి శింగరాయకొండ ప్రభుత్వ పాఠశాలలో మానవతా స్వచ్ఛంద సంస్థ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రిటైర్ మండల విద్యాశాఖ అధికారి కోటపాటి నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మలినేని లక్ష్మయ్య మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సంస్థ భవన నిర్మాణానికి తాను అండగా ఉంటానన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జెట్టి సూర్య, చంద్రశేఖర్‌రెడ్డి, మహంకాళి నరసింహారావు, పాకల కోటేశ్వరరావు, గుంజి రమణయ్య, మాలే ప్రకాష్‌రెడ్డి, హరే రామ అరే, బోయిన రాంబాబు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మలినేని విద్యాసంస్థల ప్రొఫెసర్ డాక్టర్ రాచకొండ శ్రీనివాసరావు కుమారుడు వెంకట సాయి మణిదీప్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం నాడు సాయిబాబా మందిరంలో, తెలుగు బాపిస్ట్ చర్చిలో కొంతమంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సైమన్‌బాబు, అనిల్, కొల్లూరు సత్యనారాయణ, తాతయ్య రాచకొండ కోటేశ్వరరావు, అక్కయ్య తేజశ్రీ,శ్రీరాం, రామయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

తలుపు తడితే 'క్వార్టర్'

యర్రగొండపాలెంలో బెల్ట్‌షా'ఫుల్'


ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో మంచినీళ్లు దొరకని గ్రామాలున్నాయేమో గానీ.. మద్యం దొరకని గ్రామాలు ఉన్నాయనడం అతిశయోక్తి కాదనిపిస్తుంది. ఎందుకంటే పరిస్థితి ఆవిధంగా ఉంది. యర్రగొండపాలెం మండలంలో ప్రభుత్వ వైన్ షాపులు నాలుగు, త్రిపురాంతకం మండలంలో మూడు, పుల్లలచెరువు మండలంలో మూడు చొప్పున ఉన్నాయి. అయితే ఆయా వైన్ షాపుల్లో మద్యం పక్కదారి పడుతోంది. మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో ఎప్పుడంటే అప్పుడు మద్యం లభిస్తోంది. ఆయా గ్రామాల్లోని కిరాణా, కూల్ డ్రింక్స్ విక్రయించే దుకాణాల్లో గుట్టు చప్పుడు కాకుండా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ వైన్ షాపుల్లో పని చేసే వారికి కొద్దో గొప్పో డబ్బులు అదనంగా చెల్లించి, ఒకట్రెండు కేసుల మద్యం తీసుకొచ్చి ఆయా దుకాణాల నిర్వాహకులు వారి గ్రామాల్లో అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ షాపులలోని కొందరు సేల్స్ బాయ్స్ అదనపు డబ్బులకు కక్కుర్తిపడి దొంగ చాటుగా మద్యం అమ్ముతున్నారని ఆరోపణలున్నాయి. క్వార్టర్ బాటిల్‌పై ఉన్న ధరకు అదనంగా పది రూపాయలను చిల్లరకొట్లు, కూల్ డ్రింక్స్



ఓ హోటల్‌లో మద్యం తాగుతూ భోజనం చేస్తున్న యువకులు

దుకాణాల నిర్వాహకులు వారికిస్తున్నట్లు సమాచారం. యర్రగొండపాలెంలో ఏకంగా బీడీ బొంకులు, తోపుడు బండ్లపై యధేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి. యర్రగొండ పాలెం పట్టణంలోని వినుకొండ రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక చుట్టూ పదుల సంఖ్యలో తోపుడు బండ్లపై మద్యం విక్ర యించేవారు పదుల సంఖ్యలో ప్రతిరోజూ కనిపిస్తుంటారు. కొన్ని పంచాయితీల్లో ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు, మరికొన్ని గ్రామాల్లో ఎప్పుడైనా సరే తలుపు తడితే మద్యం దొరుకుతోంది. క్వార్టర్ బాటిల్ అసలు ధరతో పాటు సుమారు ముప్పై నుంచి నలభై రూపాయల వరకు అదనంగా బెల్ట్ షాపుల నిర్వాహకులు తీసుకుంటున్నారు. కొందరు అవినీతి అధికారులు, స్థానిక నాయకుల ప్రోద్బలం వల్లే ఇలా విచ్చల విడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వారికి నెల వారీ మామూళ్లు అందుతుండటంతో బెల్ట్ షాపుల నిర్వాహకులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఉన్నతాధికారులు తనిఖీలు చేసేందుకు వస్తున్నారనే సమాచారం. మద్యం అక్రమ విక్రయదారులకు ముందుగానే చేరవేస్తున్న ఇంటి దొంగలు ఉన్నంతకాలం అక్రమ అమ్మకాలు జరుపుతూనే ఉంటారు. సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా సోదాలు నిర్వహించి చేతులు దులుపుకోవడం తగదని ప్రజలు, ముఖ్యంగా మహిళలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆయా గ్రామాల్లో బెల్ట్ షాపులపై నిఘా ఏర్పాటు చేసి సోదాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



బహుమతులు అందజేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గిద్దలూరు

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా గత వారం రోజులుగా 18 టీములు పాల్గొన్న నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు సమీపంలోని రాచర్ల మోడల్ స్కూల్ దగ్గర గల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో డాక్టర్ ఆదాము టీం, రాచర్ల టీం ఫైనల్ పోరులో తలపడగా డాక్టర్ ఆదాం టీము ఐదు వికెట్ల తేడాతో రాచర్ల జట్టుపై విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. వీరికి మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉత్తేజాన్ని, స్నేహ సంబంధాలని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మంచి ఆటను కనబర్చిన క్రీడాకారులను, నిర్వాహకులైన రాచర్ల అశోక్ కుమార్, పవన్‌లను అభినందించారు. తదనంతరం క్రైస్తవ సోదరులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డిని కమిటీ వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి సహకరించిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కటికె యోగానంద్‌ను కూడా కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు కార్యదర్శి గోపిరెడ్డి జీవనేశ్వరరెడ్డి, నాయకులు నల్లబోతుల శ్రీనివాసులు, యమా సంజయ్, సొసైటీ బ్యాంక్ వైస్ చైర్మన్ గోమాసాని రహమతుల్లా, తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి షేక్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



పేదలకు అల్పాహారం అందజేస్తున్న కరిముల్లాబేగ్

పేదలకు అల్పాహారం అందజేత

ప్రజాశక్తి-పొదిలి

ఆయన రిటైర్డ్ ఉపాధ్యాయుడు... సామాజిక సేవా తత్పరతతో పేదలకు సహాయం చేయడం ఆయన హాబీ... తనకున్న దానిలో నలుగురికి సహాయపడటం కోసం నిత్యం తపిస్తుంటాడు. అందుకోసం కుటుంబసభ్యులతో కలిసి హబీబుల్లాబేగ్ అనే స్వచ్ఛంధ సంస్థను ఏర్పాటు చేశారు షేక్ కరిముల్లాబేగ్. ప్రతి నిత్యం పట్టణంలోని 30 మంది పేదలకు ఉదయం అల్పాహారం అందించేందుకు కంకణం కట్టుకున్నాడు. తనకు వచ్చే ఫింఛను డబ్బులతో కొంతభాగం ప్రతి రోజూ ఉదయం నిరుపేదల ఆకలి తీరుస్తున్నాడు.



చీరలు అందజేస్తున్న దృశ్యం

క్రిస్మస్ సందర్భంగా చీరలు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని ఐనముక్కల గ్రామంలో గల జీసస్ హీలింగ్ మినిస్ట్రీస్‌లో ఆదివారం క్రిస్మస్ ఆరాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ అధ్యక్షుడు సింగా ఏసన్న క్రిస్మస్ కేక్ కట్ చేశార. వంద మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో నిత్యావసరాల ధరలకు రెక్కలు

మైనంపాడులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి..'

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

వైసిపి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని టిడిపి మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు విమర్శించారు. మండలంలోని మైనంపాడులో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి..' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ ధరలు సామాన్యులకు అందుబాటులో లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ఆళ్ల ఆంజనేయులు, నాయకులు పెరుగు రాము, ఆళ్ళ బ్రహ్మయ్య, కాకర్ల యలమందయ్య, దావులూరి అనిల్‌కుమార్, ఆళ్ల శ్రీను, ఆళ్ళ తిరుపతిస్వామి, బాపట్ల పార్లమెంటు టిఎన్టియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నారాయణస్వామి చౌదరి, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు నార్నె మాధవీలత, టీడీపీ బాపట్ల పార్లమెంటు కార్యదర్శి కొత్తపల్లి పద్మ పాల్గొన్నారు.



'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

మనుధర్మ శాస్త్రం ప్రతులు దహనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

భారతదేశ అభివద్ధికి ప్రధాన అడ్డంకిగా, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థకు మూలకారణమైన మను ధర్మ శాస్త్రం ప్రతులను ఆదివారం శింగరాయకొండలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ వాదులు, ప్రజా సంఘాల నాయకులు దహనం చేశారు. జైభీమ్ పీపుల్స్ జేఏసి అంబేద్కర్ విగ్రహ కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జైభీమ్ పీపుల్స్ జేఏసీ జాతీయ అధ్యక్షులు అంబటి కొండలరావు, డి.నాగేశ్వర రావు, అల్లు వెంకటేశ్వర్లు, కనపర్తి సింహాద్రి, సంకె కొండలరావు, కోటయ్య, సుబ్బారావు, పి.క్రిష్ణయ్య, చొప్పర వెంకన్న, పి.మహేంద్ర పాల్గొన్నారు.



మనుధర్మ శాస్త్రం ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

చెంచుల కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని చెన్నుపల్లి చెంచు గూడెంలో నివసిస్తున్న 50 కుటుంబాల చెంచులకు హార్ట్ లాండ్ గ్రేస్ అజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ ఎనిబెర బెంజమిన్, ట్రెజరర్ మమత ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎక్కువ మందికి సహాయం చేయాలన్నదే మా ఆశయం అని చెప్పారు. గంజివారిపల్లి సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ ఆదరణ లేని చెంచులకు ట్రస్టులు, స్వచ్ఛందసంస్థలు ముందుకొచ్చి ఆదుకోవడం శుభ పరిణామమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మరింత మంది చెంచులకు సహాయసహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో అందుగుల చిన్నబాబు, పరిశపోగు ఆనంద్, పరిశపోగు వికాష్ పాల్గొన్నారు.



చెంచులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కొండపి

క్రిస్మస్ పండుగను పురష్కరించుకుని ఆదివారం స్థానిక కొండపిలో హెర్బన్ మందిర్, చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యఅతిథిగా చింతల ఎక్స్‌పోర్టు అధినేత చింతల వెంకటేశ్వర్లు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం పాస్టర్లు చింతల వెంకటేశ్వర్లను శాలువాతో, పూలమాలతో సత్కరించారు.

పొదిలి: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పొదిలిలో పెద్ద చర్చిలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ ఓల్డ్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకి పండ్ల రసాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక పొదిలి డివిజన్ ప్రధాన కార్యదర్శి బూదాల దేవప్రసాద్, ఫొటోగ్రాఫర్స్ సంఘం అధ్యక్షులు రావూరి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు రావూరి రాయల్, ట్రెజరర్ కాకర్ల అశోక్, సెక్రెటరీ యుద్ధం వెంకట్రావు, సభ్యులు ప్రసాద్, చెమట శీను, వడ్లమాని శీను, కష్ణ, శ్రీధర్, ప్రవీణ్, అచ్చయ్య, వెంకటేశ్వర్లు, సిలార్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: క్రీస్తు మార్గమే ప్రపంచ జీవన శాంతి మార్గమని మత బోధకులు సూచించారు. ఆదివారం యర్రగొండపాలెంతో పాటు అన్ని గ్రామాలలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. పలు చర్చిల్లో పేదలకు దుస్తులు, చీరలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేశారు. చిన్నారులకు క్రిస్మస్ బహుమతులను అందజేశారు. వివిధ పోటీలలో గెలుపొందిన సండే స్కూల్ విద్యార్థులకు బహుమతులిచ్చారు.



కొండపిలో క్రిస్మస్ వేడుకల్లో చింతల వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు రూరల్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండలంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడులోని వడ్డెరపాలెం వద్ద గల కవనెంట్ చర్చిలో క్రిస్మస్ కేకును మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి కట్ చేశారు. చర్చి పాస్టర్ యాకోబు, మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విలియమ్స్ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటిసి దుంపా రమణమ్మ, వైస్ ఎంపీపీ టి.రాగమ్మ, 10వ వార్డు మెంబర్ రాంకూరి నెహెమియా, వైసీపీ నాయకులు కె.సుబ్బారావు, జి.ప్రసాద్, కె.సుధీర్ పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో తర్లుపాడు తెలుగు బాపిస్ట్ చర్చ్ ఫాస్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంనకు 30 కిమీ దూరంలో ఉన్న శిరిగిరిపాడు వేద పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యర్రగొండపాలెం నకు చెందిన 1977-78 పదవ తరగతి బ్యాచ్ కలర్స్ గ్రూప్ సభ్యులు కోదండ రామయ్య, అన్నమరాజు మురళీకష్ణ ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. శిరిగిరిపాడు గ్రామంలో బ్రహ్మశ్రీ పుల్లాబట్ల జగన్నాథ శాస్త్రి మెమోరియల్ వారు 9 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు గత 23 సంవత్సరాల నుండి ఉచితంగా వేదాలను నేర్పిస్తున్నారు. ఇక్కడ కర్నూల్, హైదరాబాద్, వినుకొండ, అనంతపురం, గుంటూరు మొదలైన ప్రాంతాల నుండి వచ్చి వేదాలను అభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోదండరామయ్య సతీమణి వాణి, అన్నమరాజు మురళీకష్ణ సతీమణి, లక్ష్మీనారాయణ సతీమణి కలిసి వారికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలర్స్ గ్రూప్ సభ్యులు తుమ్మలపల్లి కోట సుబ్బారావు, జ్యోతి ప్రసాదరావు, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆదివారం శింగరాయకొండ గ్రామ పంచాయతీలోని గోపాల్‌నగర్ వెనుక వైపు, ఓవిరోడ్‌లో ఉన్నటువంటి కవనెంట్ చర్చిలో తెలుగుదేశం పార్టీ శింగరాయకొండ పట్టణ అధ్యక్షులు కునపరెడ్డి వెంకట సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ కూనపరెడ్డి వెంకట హైమావతి ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అక్కడ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణమోహన్

కట్టావారిపాలెంలో ఉచితంగా వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని కట్టావారిపాలెం గ్రామంలో ఆదివారం స్థానిక స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కంకణాల కృష్ణమోహన్ శిబిరంలో పాల్గొని 32 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు వ్యాధులను అశ్రద్ధ చేస్తే పక్షవాతం, మూత్రపిండాల వ్యాధులు, కంటిచూపు మందగించుట మరియు గుండెజబ్బులు వంటి ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, మానికొండ వెంకటేశ్వర్లు, వీరవెూసు మస్తానరావు పాల్గొన్నారు.

పంటలు కాపాడుకొనేందుకు రైతుల పాట్లు

- పగలు పశువులు, రాత్రి అడవి పందులతో ఇక్కట్లు
- పంటలకు రక్షణగా చీరలతో కంచె
- పాత చీరలకు పెరిగిన గిరాకీ



పంటలను కాపాడుకొనేందుకు చీరలతో ఏర్పాటు చేసిన కంచె

ప్రజాశక్తి-పిసిపల్లి

పంటలను కాపాడుకొనేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. పగలు పశువులు, రాత్రి సమయంలో అడవి పందుల బెడదతో రైతులు సతమమతవుతున్నారు. వాటి బారీ నుంచి పంటలను కాపాడుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఓ వైపు పీడ, చీడలతో మరో వైపు పశువులు, అడవి పందుల బెడదతో రైతు ఇరవై నాలుగు గంటలు మానసిక, శారీరక ఇబ్బందులకు గురవుతున్నారు. చీడ పీడల నివారణ కోసం వినియోగించే మందులు ధరలు ఆకాశనంటుతున్నాయి. పురుగు మందులు వినియోగించినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. రకరకాల మందులు వినియోగించి ప్రయోగాలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు మందులు వినియోగిస్తే వైరస్ తగ్గుతుంది. అయితే మళ్లీ వారం రోజుల్లోనే మరో వైరస్ పంటలను ఆశిస్తుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట ఏపుగా పెరిగి మరో నెల రోజుల్లో కోత దశకు చేరుతుంది. ఈ నేపథ్యంలో అడవి పందులు, పశువుల బెడద అధికంగా ఉంది. గతంలో అడవి పందులు పొలాల్లోనికి రాకుండా తగరపు కాగితాలు, తీగలు, చీరలను వినియోగించేవారు. అయినప్పటికీ అడవి పందులు వాటిని లెక్క చేయడం లేదు. దీంతో పొలాలకు కంచెలుగా చీరలు వినియోగిస్తున్నారు. ఫలితంగా పాత చీరల వ్యాపారం కొందరికి ఆదాయ ఒనరుగా మారింది. గతంలో రూ.10 ఉన్న పాత చీర ప్రస్తుతం రూ.25 చేరింది. పూర్వం వరి పంటకు మాత్రమే చీరలు వినియోగించేవారు. ప్రస్తుతం కంది, మినుము, పైర్లకు కూడా కంచెగా చీరలను వినియోగిస్తున్నారు. అయినప్పటికీ అడవి పందుల బెడద తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో గత సంవత్సరాలుగా పలు రకాల అరుపులను, సౌండ్‌లను రికార్డు హ్యాండ్ మైకుల ద్వారా పొలాల్లో శబ్దాలు చేస్తున్నారు. గతలంలో రూ.500 ఉన్న హ్యాండ్ మైకు ప్రస్తుతం రూ.1200 చేరింది. ఈ శబ్దాలను కూడా పందులు లెక్క చేయడం లేదు. గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లోని హ్యాడ్ మైకు ఏర్పాటు చేయడం వల్ల ప్రజల నిద్రకు భంగం కలుగుతోంది. అనేక కష్టనష్టాలు పడుతున్నప్పటికీ పంట చేతికొస్తుందోలేదో నని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే వేదికపై చేరిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండల పరిధిలోని పుట్టావారిపాలెం గ్రామం సమీపంలోనున్న బాల భారతి విద్యా నికేతన్‌లో 1998-99 సంవత్సరంలో పదవ తరగతి చదిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. గత మధుర స్మృతులను గుర్తు చేసు కున్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి, ఉపాధ్యాయులు బత్తిన వెంకటేశ్వరరావు, మస్తాన్ వలి, బివి. సుబ్బారావుకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామమూర్తి చౌదరి, లక్ష్మీ కాంతమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- బాపట్ల రూరల్

అభినవ తిక్కనగా ప్రసిద్ధిగాంచిన తుమ్మల సీతా రామమూర్తి చౌదరి ఆధునిక పద్య కవుల్లో అగ్ర గణ్యులని, వారి గాంధేయవాద కవిగా ప్రఖ్యాతి పొందారని బాపట్ల సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ తెలిపారు. తుమ్మల సీతా రామమూర్తి చౌదరి 121, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ 105 వ జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహవర్మ మాట్లాడుతూ ఆంధ్ర విదుషీకుమారి, సాహితీ రుద్రమగా ప్రసిద్ధి పొందిన ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ స్త్రీవాద రచయితులలో ప్రముఖులని తెలిపారు. తుమ్మల సీతారామమూర్తి చౌదరి, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ బాపట్ల వాసులు కావటం ఇక్కడి ప్రజల అదష్టమని కస్తూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సప్త స్వర సంగీత కళాశాల ప్రిన్సిపల్ కోటి రాజ్ ,టి.శ్రీనివాస్, అల్లూరమ్మ, ఆదం షఫీ, మర్రి మాల్యాద్రి రావు పాల్గొన్నారు.

ఫోరమ్ ఫర్ బెటర్ ఆధ్వర్యంలో..

ఆంధ్ర కవిత్రుల చరిత్రను గ్రంథస్తం చేసి, ఆంధ్ర వాఙ్మయ్య చరిత్రలో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ సుస్థిర స్థానం సంపాదించు కున్నారని ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి సాయిబాబు తెలిపారు. లక్ష్మీకాంతమ్మ 105వ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల వారిలో ఆధ్వర్యంలో లక్ష్మీకాంతమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నటుడు నాగేశ్వరరావు, జి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



చీరాలలో వాక్యం బోధిస్తున్న పాస్టర్ విక్టరీ ఇమాన్యుల్

ప్రజాశక్తి-చీరాల

క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థ నలు నిర్వహిం చారు. క్రిస్మస్ సందర్భంగా పలు ప్రార్ధనా మందిరాలు రంగు రంగు విద్యుత్ దీపాలతో కళకళ లాడాయి. ఈ సందర్భంగా పాస్టర్లు క్రీస్తు పుట్టుక గురించి ప్రత్యేక ప్రార్ధనలు చేస్తూ వివరించారు. చీరాల పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి ను రంగు, రంగు విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. **దర్శి :** దర్శి పట్టణంలోని బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టరు జాన్ అధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అర్ధరాత్రి కేక్ కట్ చేసి ప్రార్ధనలు చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల చర్చిలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. **పిసిపల్లి :** క్రిస్మస్ వేడుకలను మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్ధనా మందిరాలను రంగురంగు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక విజయనగర్ కాలనీలో విశ్రాంత ఉపాధ్యాయుడు, వామపక్ష వాది కోండ్రు సుదర్శనం పేరు మీదుగా తాలూకా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు.

పవర్ స్ప్రేయర్లు పంపిణీ



రైతులకు పవర్ స్ప్రేయర్లు అందజేత

ప్రజాశక్తి -పంగులూరు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ఫౌండేషన్, రోటరీ క్లబ్ శింగరకొండ వారి ఆధ్వర్యంలో అద్దంకిలోని రోడ్డులో కూకట్ల కన్వర్షన్ హాలులో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పవర్ స్ప్రేయర్లు అందజేశారు. చిట్టా బత్తిన కృష్ణ కిషోర్ , కొల్లి కిరణ్ బాబు , గుదిబాలాజీ నాయుడు చందలూరు గ్రామ రైతులకు ఈ పవర్ స్ప్రేయర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తానా ప్రెసిడెంట్ అంజయ్య చౌదరిలావు , తానా కోఆర్డినేటర్ కూకట్ల శ్రీనివాస్, వెంకట రమణ, యార్లగడ్డ జనార్ధన్ నిమ్మలపూడి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



నగరోత్సవంలో మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ వెంకారెడ్డి

ఘనంగా నగరోత్సవం

ప్రజాశక్తి-చీమకుర్తి

శ్రీవెకటేశ్వరస్వామి నగరోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాగింది. ఈ సందర్భంగా స్థానిక హరిహరక్షేత్రం నుంచి శ్రీకృష్ణమందిరం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత నగరోత్సవాన్ని మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ప్రారంభించారు. ప్రత్యేకంగా సుందరంగా అలంకరించి వాహనంలో వెంకటేశ్వరస్వామికి నగరోత్సవం నిర్వహించారు. నగరోత్సవానికి దారి పొడవునా దీపాలతో హారతులు పట్టారు. నగరోత్సవాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్దన తరలి వచ్చారు.

ఉపనిషత్తులు జ్ఞాన భాండాగారాలు

విశ్రాంత ఐపిఎస్ అధికారి సూరపురాజు వాసుదేవరావు



మాట్లాడుతున్న విశ్రాంత ఐపిఎస్ అధికారి వాసుదేవరావు

ప్రజాశక్తి-అద్దంకి

ఉపనిషత్తులు జ్ఞాన భాండాగారాలని, తాత్వకగ్రంథాలు, విశ్వాంతరాళంలో మనిషికి ఉండే స్థానాన్ని గూర్చి చర్చిస్తాయని విశ్రాంత ఐపిఎస్ అధికారి సూరపురాజు వాసుదేవరావు తెలిపారు. స్థానిక రామసుశీల నిలయంలో సజనసాహిత్య సమావేశం పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ఉపనిషత్ అనే పదానికి సమీపానికి తీసుకపోవడమని అని ఒక అర్థమని, ఉపనిషత్ అంటే గురవు సమీపంలో కింద కూర్చొని వినే జ్ఞానం అని మరో అర్థం ఉందన్నారు. అనంతరం వాసుదేవరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యు.దేవపాలన, అన్నమనేని వెంకటరావు, చుండూరి మురళీ సుధాకర్, గాడేపల్లి దివాకర దత్తు, నాగండ్ల శంకరరెడ్డి, కూరపాటి రామకోటేశ్వరరావు, జాగర్లమూడి ప్రతాప్ ,షేక్ మస్తాన్ ,ధర్మవరపు సీతారామయ్య, ఓరుగంటి శ్రీనివాసరావు, మువ్వా ప్రసాదు, మారం కోటేశ్వరరావు, కందికట్ల సత్యం పంతులు, అద్దంకి లెవిప్రసాదు, వామరాజు వెంకటేశ్వర్లు, గోపినాథం హరనాథ్, కంఠం రాజు తదితరులు పాల్గొన్నారు.

తొలుత శ్రీలక్ష్మీనరసింహస్వామి, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామివార్ల విశ్రాంత ఐపిఎస్ అధికారి సూరపురాజు వాసుదేవరావు ,వారి ధర్మపత్ని, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి దంపతులు దర్శించుకున్నారు. వారికి శ్రీశింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ అధికారులు పూర్ణకలశంతో స్వాగతం పలికారు. అనంతదరం శ్రీకాళికాసమేత కమఠేశ్వర స్వామి వారి దేవాలయంలోని పండరంగడు, అద్దంకి పద్యశాసనం, ఎర్రయ్య విగ్రహం, టంగుటూరి ప్రకాశంపంతులు విగ్రహాలకు పూలమాలలు వేశారు. అద్దంకి పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ వలి, లక్కరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆత్మీయతల పెంపుదలకు సమ్మేళనాలు దోహదం



కేక్ అందజేస్తున్న దృశ్యం

కారుమంచి పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986వ సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులందరూ 37 సంవత్సరాల తర్వాత ఆదివారం కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుతం ఏమి చేస్తున్నారు.. ఎక్కడ ఉన్నారు అనే విషయాలను ఒకరికొకరు పంచుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ ఆలింగనం చేసుకుని బాల్యంలో గత స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడు బి.సుబ్బారావును ఘనంగా సన్మానించారు. అందరినీ ఒకచోటకు చేర్చేందుకు ఎంతో కృషి చేసిన విజయవాడ దూరదర్శన్ విభాగం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

డైరెక్టర్ రత్నాకర్, సుబ్బారావు, జాలయ్య, సుబ్బారెడ్డిలను తోటి మిత్రులు అభినందించారు. ఇకపై ప్రతి ఏటా కారుమంచి జడ్పీ హైస్కూల్‌లో కలుసుకోవాలని అందరూ నిర్ణయించుకున్నారు.



బాలినేని దంపతుల సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న మేయర్ సుజాత

మేయర్ ఇంట క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగర మేయర్ గంగాడ సుజాత ఇంట్లో క్రిస్మస్ పండుగ సంబరాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె ఏర్పాటు చేసిన విందుకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. అతిథుల సమక్షంలో మేయర్ దంపతులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, అధికార, ప్రతిపక్షానికి చెందిన పలువురు కార్పొరేటర్లు, అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

27న ధర్నాను జయప్రదం చేయండి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు

ప్రజాశక్తి-చీమకుర్తి

మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలని కోరు తూ ఈ నెల 27న ఒంగోలులోని పొగాకు బోర్డు ఆర్ఎం కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని దెబ్బతిన్న పొగ తోటలను రైతు సంఘం బృందం పరిశీలించింది. అనంతరం స్థానిక పంగులూరి కృష్ణ య్య భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పమిడి వెంకటరావు మాట్లాడుతూ ఎప్పుడూ లేని విధంగా డిసెంబర్ నెలలో అకాల వర్షాల వల్ల పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పల పాడు, టంగుటూరు, కొండపి మండలాలలో కొట్టుకొచ్చిన పొగతోటలు కుళ్లిపోయి పనికి రాకుండా పోయిందన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికే రూ.40 వేలు ఎకరాకు ఖర్చు చేసి, మరలా పొగనాట్లు వేయాల్సి రావడంతో తీవ్రంగా ఇబ్బంది పడినట్లు తెలిపారు. ఇప్పటికే బ్యానర్‌కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చు పెట్టి, పంట అంతా నీటిపాలు కావడంతో మరలా ఖర్చులకు



మాట్లాడుతున్న పమిడి వెంకటరావు

ఇబ్బంది పడాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చీమకుర్తి మండలంలో ప్రస్తుతానికి పొగతోటలు ఉరకలేసి తుక్కు కన్నా 2 నుంచి 3 క్వింటాళ్ళు దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులకు ఎకరాకు రూ.30 వేలు పైగా నష్టం వస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి నష్టపోయిన పంటను నమోదు చేయించాలని, పూర్తిగా పీకివేసిన తోటలకు ఎకరాకు రూ.25 వేలు, దిగుబడి తగ్గిన తోటలకు రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రుణాలు రీషెడ్యూలు చేసి, మరలా బ్యానర్లకు రూ.లక్ష వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, కౌలు రౌతులను గుర్తించి వారికి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఈ నెల 27న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం సహాయ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కొల్లూరి వెంకటేశ్వర్లు, మండల నాయకులు కొల్లూరి అక్కయ్య, వ్య.కా.సం. మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోవిడ్ ప్రోటోకాల్ పాటించాలి

- కొత్త వేరియంట్‌పై అప్రమత్తంగా ఉన్నాం
- సత్ఫలితాలిస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్'
- కండ్లకలక పట్ల అజాగ్రత్త వద్దు
- నెలాఖరుకి 5 ఎంపిహెచ్‌సిలు ప్రారంభం
- డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కోవిడ్ కొత్త వేరియంట్ ఒమిక్రాన్ బిఎఫ్-7పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉన్నట్లు డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ సత్ఫలితాలు ఇస్తోందన్నారు. నెలాఖరు నాటికి ఐదు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అమలు చేస్తున్న వైద్య సేవలను ఆమె 'ప్రజాశక్తి'కి వివరించారు.

కోవిడ్ కొత్త వేరియంట్‌పై రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేయటంతో ప్రజలందరూ కోవిడ్ ప్రోటోకాల్‌ను పాటించాలి జిల్లాలో ఇప్పటివరకూ ఒమిక్రాన్ బిఎఫ్-7 కేసులేమీ నమోదు కాలేదు. మాస్క్ ధరించటం, భౌతిక దూరం పాటించటం, జనం రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండటం, చేతులు శానిటేషన్ చేసుకోవటం తప్పనిసరి. తద్వారా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవచ్చు. దగ్గు, జలుబు, గొంతు మంట, జ్వరం, తలనొప్పి లక్షణాలు ఉంటే పరీక్ష చేయించుకోవాలి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కరోనా పరీక్షలు చేయటానికి ఏర్పాట్లు చేశాం. పాజిటివ్ కేసులలో వేరియంట్ నిర్ధారణకు జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం విజయవాడ పంపుతాం.

100 శాతం సెకండ్ డోస్ పంపిణీ

కరోనా వ్యాక్సిన్ రెండో డోసును జిల్లాలో ప్రజలందరికీ 100 శాతం పూర్తి చేశాం. బూస్టర్ డోస్ పంపిణీని 50-60 శాతం మాత్రమే ప్రజలు తీసుకున్నారు. 3వ దశలో ఒమిక్రాన్ వేరియంట్ తీవ్రత తక్కువగా ఉండటంతో ప్రికాషనరీ డోస్ (బూస్టర్ డోస్) వేయించుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపలేదు. క్షేత్రస్థాయి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలందరికీ ఈ డోసు వేశాం. 18-59 ఏళ్ల వయస్సు వారు 40 శాతం, 60 ఏళ్లు పైబడిన వారికి 76 శాతం డోస్ వేశాం. అర్హులందరూ పూర్తి స్థాయిలో ప్రికాషనరీ డోస్ వేయించుకోవాలి. ముందు జాగ్రత్త చర్యగా ఒంగోలు జిజిహెచ్‌తో పాటు జిల్లాలోని ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రులలో ప్రత్యేక పడకలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం. జిల్లాలో కోవిడ్



మూడు దశల్లో 1,56,532 కేసులు నమోదయ్యాయి. మొదటి దశలో 73,142, రెండో దశలో 83,246, మూడో దశలో 144 కేసులు నమోదయ్యాయి. మొదటి దశలో 632, రెండవ దశలో 530, మూడో దశలో ఒకరు మొత్తం 1163 మంది మరణించారు.

సత్ఫలితాలిస్తోన్న ఫ్యామిలీ డాక్టర్

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ ఫిజీషియన్' సత్ఫలితాలిస్తోంది. అక్టోబర్ 21న జిల్లాలో ప్రారంభమైన కార్యక్రమంలో ఇప్పటివరకు 1558 క్యాంపులు నిర్వహించాం. ఇందులో 14 రకాల పరీక్షలు, 57 రకాల మందులు అందిస్తున్నాం. 35 మండలాలలో రోజుకి ఒక గ్రామం చొప్పున 64,325 మందికి వైద్యసేవలు అందించాం. ఈ విధానంలో జిల్లాలో మొత్తం 64 పిహెచ్‌సిలలో ఇద్దరు వైద్యుల చొప్పున కేటాయించి ఒకరు ఆరోగ్య కేంద్రంలో ఓపి సేవలు, మరొకరు ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు రొటేషన్ పద్ధతిలో సేవలందిస్తున్నారు. జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో 132 మంది వైద్యులు, 430 మంది ఎంఎల్‌హెచ్‌పితో పాటు సూపర్‌వైజర్లు, ఎంపిహెచ్‌వి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొంటున్నారు.

కండ్లకలకపై అజాగ్రత్త వద్దు

జిల్లాలోని పలు మండలాలలో మద్రాస్ ఐ(కండ్లకలక) కేసులు నమోదవుతున్నాయి. ఈ కేసులలో కళ్ల ఎర్రగా మారిపోతున్నాయి. వేడి నీటిలో కర్చీఫ్ ముంచి తుడుచుకోవాలి. కంటిలో చుక్కల మందు వేసుకుంటే 5 నుంచి వారం రోజులలో తగ్గిపోతుంది. కండ్లకలక వస్తే కంటి వైద్యుడిని సంప్రదించాలి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు పరీక్షిస్తారు. కంటి చుక్కల మందు అందుబాటులో ఉంది. ఆర్ఎంపిలను ఆశ్రయించవద్దు. వారు ఇచ్చే చుక్కల మందుతో భవిష్యత్తులో కంటికి ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.

నెలాఖరుకి 5 ఎంపిహెచ్‌సిలు ప్రారంభం

పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఐదు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు నెలాఖరు నాటికి ప్రారంభం కానున్నాయి. గతంలో అద్దె భవనాలలో ఉన్న యుపిహెచ్‌సిలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేశాం. ఇక్కడ వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితో పాటు మందులను అందుబాటులో ఉంచాం. ఒంగోలు నగరంలోని గద్దలగుంట, పీర్లమాన్యం, కరవది ప్రాంతాలలో ఇవి ప్రారంభం కానున్నాయి. రానున్న రోజుల్లో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తాం.